తడి, పొడి చెత్తపై అవగాహన

మాట్లాడుతున్న సిద్దిపేట డీఆర్సీ సెంటర్ ప్రతినిధులు, శానిటేషన్ ఎస్సై వనిత

బాన్సువాడ, జనవరి 2 : బాన్సువాడ మున్సిపాలిటీలో తడి, పొడిచెత్తను వేరు చేసే ప్రక్రియతో పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని డీఆర్సీ సెంటర్, బాసిల్ ఫౌండేషన్ తెలంగాణ ప్రతినిధి ఉదయ్ చందర్ కోరారు. మంగళవారం బాన్సువాడ మున్సిపాలిటీని సిద్దిపేట్ శానిటేషన్ ఇన్స్పెక్టర్ వనితతో కలిసి తడి, పొడిచెత్త వేరు చేసే ప్రక్రియను వివరించారు. ప్రతి ఇంటి నుంచి వచ్చే వ్యర్థాలు ఉపయోగపడుతాయని పలు అంశాలపై అవగాహన కల్పించారు. త్వరలోనే బాన్సువాడ మున్సిపాలిటీ డీఆర్సీ సెంటర్లో తడి, పొడిచెత్తతో పర్యావరణం కాపాడే విధంగా ప్రతినిధులు కార్యక్రమం చేపడుతారని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమేశ్, డీఆర్సీ సెంటర్ ప్రతినిధులు రాజు, శానిటేషన్ సిబ్బంది హన్మాండ్లు తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ

మాచారెడ్డి, డిసెంబర్ 2 : మండల కేంద్రంలోని ఎస్టీ మినీ గురుకులం, భవానీపేట వద్ద ఉన్న వసతిగృహంలోని విద్యార్థులకు లక్ష్మీనర్సింహా చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ముత్యాల నర్సింహారెడ్డి మంగళవారం 250 దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు చలి నుంచి రక్షణ పొందడానికి దుప్పట్లు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆరెపల్లి సర్పంచ్ లింగారెడ్డి, నవీన్‌రెడ్డి, రాంరెడ్డి, రాజు పాల్గొన్నారు.

6న జిల్లా స్థాయి సమావేశం

బాన్సువాడ టౌన్, జనవరి 2 : బాన్సువాడలోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో ఈ నెల 6వ తేదీన నిర్వహించనున్న దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా స్థాయి సమావేశానికి జిల్లా పరిధిలోని దివ్యాంగులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గంగాధర్ చారి పిలుపునిచ్చారు. బాన్సువాడ పట్టణంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమావేశం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమానికి జిల్లా పరిధిలోని దివ్యాంగులు తరలిరావాలని కోరారు. సమావేశంలో గొల్ల గంగాధర్, గంగారాం, సాయిరాం, సంగప్ప పాల్గొన్నారు.

పోలీసులకు ప్రజలు సహకరించాలి

కామారెడ్డి, జనవరి 2 : రోడ్లపై విధులు నిర్వహించే పోలీసులకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్పీ సింధూశర్మ అన్నారు. ట్రాఫిక్ నిబంధనలు వాహనదారుల సౌకర్యార్థం, రోడ్డు ప్రమాదాల నివారణకు ఏర్పాటు చేసినవని, ట్రాఫిక్ రూల్స్‌ను వాహనదారులు పాటించాలని సూచించారు. జిల్లాలో చాలా మంది వాహనదారులు తమ వాహనాలకు నంబర్ ప్లేట్ లేకుండా ప్రయాణిస్తున్నారని అది నేరమని అన్నారు. ఇకనైనా తమ వాహనాలకు నంబర్ ప్లేట్ ప్రభుత్వం నిర్దేశించిన విధంగా ఉండాలని లేని పక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్పష్టంగా కనిపించేలా నంబర్ ప్లేట్ ఉండాలని అన్నారు. నంబర్ ప్లేట్ పై అసభ్యకరమైన రాతలు రాయకూడదని తెలిపారు. మైనర్లకు వాహనాలను ఇవ్వొద్దని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించని వారిపై కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు.

అన్ని పథకాలకు ఒకే దరఖాస్తు ఇవ్వాలి

- కలెక్టర్ జితేశ్ వీ పాటిల్
- ప్రజాపాలనకు వెల్లువెత్తిన దరఖాస్తులు
- పర్యవేక్షించిన అధికారులు, ప్రజాప్రతినిధులు

తుజాల్‌పూర్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

నమస్తే తెలంగాణ యంత్రాంగం, జనవరి 2 : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న ఆరు గ్యారంటీ పథకాల కోసం ఒకే దరఖాస్తు ఫారం ఇవ్వాలని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ సూచించారు. దోమకొండతోపాటు మండలంలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమంలో ప్రజల నుంచి దరఖాస్తుల స్వీకరణ కొనసాగింది. లింగుపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ఇబ్బందులు లేకుండా దరఖాస్తులను స్వీకరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. 6వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారు తప్పని సరిగా రసీదు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ రాజ లక్ష్మి, ప్రజా ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రామారెడ్డి మండలంలోని కన్నాపూర్ తండా తదితర గ్రామాల్లో కొనసాగుతున్న ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణను కలెక్టర్ పరిశీలించారు. ఆయనవెంట ఎంపీడీవో సవితారెడ్డి, స్పెషల్ ఆఫీసర్ వరదారెడ్డి, సర్పంచ్, ఉపసర్పంచులు చందర్, శర్మన్ తదితరులు ఉన్నారు. బీబీపేట మండలంలోని తుజాల్‌పూర్ గ్రామంలో ఏర్పాటు చేసి ప్రజాపాలన సభను కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ సందర్శించారు. దరఖాస్తుల వివరాలను కౌంటర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. యాడారంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసి సభలో దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ పరికి ప్రేమ్‌కుమార్, సర్పంచులు వెంకట్‌రావు, సుధాకర్‌రెడ్డి, ఎంపీడీవో పూర్ణచంద్రోదయకుమార్, తహసీల్దార్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూర్ మండలం బస్వాపూర్ గ్రామంలో ప్రజాపాలన కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఎంపీడీవో అనంతరావు తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడ మండలంలోని కోనాపూర్, కొత్తాబాది, ఇబ్రహీంపేట్ తండా గ్రామాల్లో లబ్ధిదారుల నుంచి అధికారులు మంగళవారం దరఖాస్తులను స్వీకరించారు. అర్హులైన వారందరూ దరఖాస్తు చేసుకోవాలని నోడల్ అధికారులు తహసీల్దార్ వరప్రసాద్, ఎంపీడీవో సత్యనారాణ సూచించారు. గ్రామాల సర్పంచులు వెంకటరమణారావు దేశ్‌ముఖ్, ప్రేమ్ సింగ్, అంకిత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కామారెడ్డి మండలంలోని పలు గ్రామాల్లో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం కొనసాగుతున్నది. మాచారెడ్డి మండలంలోని ఆరెపల్లి, అక్కాపూర్, కాకులగుట్టతండా, బండరామేశ్వర్‌పల్లిలో ప్రజాపాలనపై మంగళవారం గ్రామ సభలు నిర్వహించారు. గ్రామసభలను ఆయా గ్రామాల సర్పంచుల ఆధ్వర్యంలో ఎంపీడీవో బాలకృష్ణ, తహసీల్దార్ శ్వేత ప్రారంభించి దరఖాస్తులు స్వీకరించారు. బండరామేశ్వర్‌పల్లి, అక్కాపూర్ గ్రామాలను కలెక్టర్ సందర్శించారు. రాజంపేట మండలం తలమడ్ల గ్రామంలో అధికారులు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. సర్పంచ్ యాదవరెడ్డి, ఎంపీటీసీ రాజు, తహసీల్దార్ అనిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

గాంధారి మండలంలోని ఆయా గ్రామాల్లో దరఖాస్తుల స్వీకరణ కొనసాగింది. గాంధారి తహసీల్దార్ జానకి, ఎంపీడీవో సతీశ్, ఎంపీవో రాజ్‌కిరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. నిజాంసాగర్ మండలంలోని మాగి గ్రామంలో సర్పంచ్ అంజయ్య, తహసీల్దార్ భిక్షపతి, వెల్గనూర్‌లో సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు రమేశ్‌గౌడ్, ఎంపీడీవో నాగేశ్వర్ దరఖాస్తులను స్వీకరించారు.

నాయకులు జయప్రదీప్, శేఖర్‌తోపాటు పంచాయతీ కార్యదర్శులు లక్ష్మణ్, గంగాసాగర్ పాల్గొన్నారు. పిట్లం మండలంలోని అన్నారం గ్రామంలో జడ్పీ సీఈవో సాయాగౌడ్ దరఖాస్తులను స్వీకరించారు. పిట్లం ఎంపీడీవో వెంకటేశ్వర్, సర్పంచ్ కాశీరాం తదితరులు పాల్గొన్నారు. సదాశివనగర్ మండలంలోని లింగంపల్లి గ్రామంలో ప్రజాపాలన దరఖాస్తులను ఎంపీపీ గైని అనసూయ, సర్పంచ్ గుండెల్లి సాయిలు, ఎంపీడీవో లక్ష్మి, ఎంపీవో సురేందర్‌రెడ్డి, ఉపసర్పంచ్ దామోదర్‌రావు స్వీకరించారు.

రేపటి నుంచి డీఈఐఈడీ మొదటి సంవత్సరం పరీక్షలు

కామారెడ్డి, జనవరి 2 : డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఐఈడీ) మొదటి సంవత్సరం పరీక్షల తేదీలను ప్రభుత్వ పరీక్షల సంచాలకులు విడుదల చేసినట్లు డీఈవో రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 4 నుంచి 10వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలు జిల్లా కేంద్రంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హాల్‌టికెట్లను bse.telangana.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని, పరీక్షా కేంద్రానికి ఒక గంట ముందుగానే చేరుకోవాలని సూచించారు.

విద్యార్థులకు డిజిటల్ బోధన తరగతులు

బాన్సువాడ టౌన్, జనవరి 2 : ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల కోసం అగస్త్య ఫౌండేషన్ చేస్తున్న సేవలు మరువలేనివని కోన బాన్సువాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం విజయ్ కుమార్ అన్నారు. కోన బాన్సువాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్టులు సులభంగా అర్థమయ్యేలా డిజిటల్ బోధన విధానం ద్వారా వివరించారు. కార్యక్రమంలో అగస్త్య ఫౌండేషన్ సభ్యులు శంకర్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల విక్రయాలు

బాన్సువాడ, జనవరి 2 : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజాపాలన ఆరు గ్యారెంటీలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రకటించిన నేపథ్యంలో బాన్సువాడ మున్సిపాలిటీలోని 19 వార్డుల్లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కేంద్రాల వద్ద పట్టణ ప్రజలు బారులు తీరుతున్నారు. రేషన్ కార్డు అప్లైకిగాను, పిల్లల జన్మదిన సర్టిఫికెట్ల కోసం మీసేవా సెంటర్లు, మున్సిపల్ కార్యాలయం వద్ద దరఖాస్తు చేసుకునేం దుకు బారులు తీరుతున్నారు. ఇదే ఆసరాగా చేసుకున్న పలు మీ సేవ సెంటర్ల నిర్వాహకులు అభయహస్తం ఫారాన్ని జిరాక్స్, కలర్ జిరాక్స్ తీసి రూ.10 నుంచి రూ.20 వరకు వసూలు చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. బాన్సు వాడ మున్సిపాలిటీ పరిధిలోని 19 వార్డుల్లో మంగళవారం నాటికి 5వేల 529 దరఖాస్తులు వచ్చాయని మున్సిపల్ కమిషనర్ రమేశ్ తెలిపారు. మున్సిపాలిటీలో ఈ నెల 6వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతుందని తెలిపారు.

నూతన భవనాన్ని నిర్మిస్తాం

బీబీపేట్, జనవరి 2 : మండలంలోని మాందాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను మంగళవారం జనగామ గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త తిమ్మయ్యగారి వేణుగోపాల్‌రెడ్డి సందర్శించారు. పాఠశాల శిథిలావస్థకు చేరడంతో దాని స్థానంలో నూతన భవనాన్ని నిర్మించి మౌలిక సదుపాయాలను కల్పించడానికి కృషి చేస్తామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. తక్షణమే పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రేవతి శ్రీనివాస్, దోమకొండ జడ్పీటీసీ తిమ్మల్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అంకన్నగారి శ్రీనివాస్‌గౌడ్, చింతకుంట రాకేశ్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సత్యనారాయణ, రంజిత్‌రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో

నూతన సంవత్సర వేడుకలు

కేక్ కట్ చేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.ఎన్ శ్రీదేవి

కామారెడ్డి, జనవరి 2 : జిల్లా కేంద్రంలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం బార్ అసోసియేషన్ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్ఎన్ శ్రీదేవి కేక్ కట్ చేశారు. అనంతరం న్యాయవాదులు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయమూర్తి లాల్ సింగ్ శ్రీనివాస్ నాయక్, సివిల్ జడ్జి నాగరాణి, జూనియర్ సివిల్ జడ్జి సుధాకర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అతిమాముల శ్రీధర్, ఉపాధ్యక్షుడు కోల శ్రీకాంత్ గౌడ్, ప్రధాన కార్యదర్శి బండారు సురేందర్‌రెడ్డి, కోశాధికారి దేవుని సూర్యప్రసాద్, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు రాజగోపాల్‌గౌడ్, నంద రమేశ్, నిమ్మ దామోదర్‌రెడ్డి, శేషు, అశోక్, సీనియర్ న్యాయవాదులు రామచంద్రరెడ్డి, జగన్నాథం, వెంకటరామిరెడ్డి, రమేశ్, సిద్ధరాములు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన పాలను సేకరించాలి

బీఎంసీ మేనేజర్ రమేశ్‌చారి

పాల నాణ్యతను పరిశీలిస్తున్న బీఎంసీ మేనేజర్ రమేశ్‌చారి

సదాశివనగర్, జనవరి 2: విజయ డెయిరీ సిబ్బంది ప్రతి రోజూ నాణ్యమైన పాలను సేకరించాలని అడ్లూర్ ఎల్లారెడ్డి బీఎంసీ మేనేజర్ యాడారం రమేశ్‌చారి అన్నారు. బీఎంసీ పరిధిలోని 15 గ్రామాల్లో పాల నాణ్యత(ప్యాడ్) ను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాణ్యమైన పాలకు ప్రభుత్వం అధిక ధర చెల్లిస్తుందని తెలిపారు. పాల డబ్బులను 15 రోజులకు ఒక సారి అందజేస్తున్నామని అన్నారు. ముద్ర పథకంలో భాగంగా బర్రెల కొనుగోలు కోసం పాడి రైతులకు రుణాలు అందించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు బీఎంసీ పరిధిలోని టేక్రియాల్, అడ్లూర్ ఎల్లారెడ్డి, లింగంపల్లి, భూంపల్లి, ధర్మారావుపేట్, పద్మాజివాడి గ్రామాల రైతులకు అందించామని అన్నారు. గ్రామాల్లో పశువైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సబ్సిడీపై దాణా, బీమా సౌకర్యం, గడ్డి విత్తనాలు అందిస్తున్నట్లు వివరించారు. పాడి రైతుల ఆర్థికాభివృద్ధి కోసం విజయ డెయిరీ ఎంతో కృషి చేస్తున్నదని తెలిపారు. కార్యక్రమంలో విజయ డెయిరీ సిబ్బంది వడ్ల రాములు, మంగలి రాములు తదితరులు పాల్గొన్నారు.

నిధులు కేటాయించాలని వినతి

సీఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

నిజాంసాగర్, జనవరి 2: జుక్కల్ నియోజకవర్గం అభివృద్ధికి నిధులు కేటాయించాలని సీఎం రేవంత్‌రెడ్డిని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు కోరారు. ముఖ్యమంత్రిని ఆయన మంగళవారం కలిసి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జుక్కల్‌కు ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరగా.. సీఎం సానుకూలంగా స్పందించారని తెలిపారు. జుక్కల్‌పై తనకు అవగాహన ఉన్నదని, అభివృద్ధికి తోడ్పడుతానని భరోసా ఇచ్చారని అన్నారు.

రాములు కుటుంబానికి మంత్రి పరామర్శ

రాములు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మంత్రి కృష్ణారావు

నస్రుల్లాబాద్/బాన్సువాడ, జనవరి 2 : మండలంలోని నాచుపల్లి గ్రామంలో సోమవారం మరణించిన సాదుల రాములు కుటుంబ సభ్యులను ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మంగళవారం పరామర్శించారు. రాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాన్సువాడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాచుపల్లిలో జరిగిన సంఘటన విషయమై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తనను ఇక్కడికి పంపారని తెలిపారు. బాధిత కుటుంబానికి లక్ష రూపాయల ఆర్థికసాయం అందించామని తెలిపారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి, మండల నాయకులు విజయ్‌కుమార్‌రెడ్డి, శివప్రసాద్, సాయిలు తదితరులు ఉన్నారు.

బోరు డ్రిల్లింగ్ పనులు ప్రారంభం

ఎల్లారెడ్డి, జనవరి 2: నాగిరెడ్డిపేట మండలంలోని ఎర్రారం గ్రామంలో బోరు డ్రిల్లింగ్ పనులను జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలోని వాటర్ ట్యాంక్ ఎదురుగా జడ్పీ నిధులతో బోరు వేయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆయనతోపాటు జలాల్‌పూర్ సర్పంచ్ కృష్ణ, నాయకులు లక్ష్మయ్య, సాయన్న, భూమన్న న్నారు.

ఉపకార వేతనాలు పంపిణీ

స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్న బ్యాంక్ మేనేజర్

గాంధారి, జనవరి 2: కెనరా బ్యాంకు సీఎస్ఆర్ (కార్పొరేట్ ఆఫ్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) ద్వారా మంజూరైన ఉపకార వేతనాలను మండలంలోని పొతంగల్ కలాన్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మంగళవారం అందజేశారు. పాఠశాలలో పదో తరగతి చదువుతున్న దివ్య, భావన, నిశిత, సాత్వికకు రూ.ఐదు వేల చొప్పున బ్యాంకు మేనేజర్ సాయినాథ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వడ్ల బాలరాజు, హెచ్ఎం రంగారావు, బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ రవి, ఉపాధ్యాయులు లక్ష్మణ్, సత్యనారాయణ, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెడల్స్..

రామారెడ్డి, జనవరి 2: మండలంలోని పోసానిపేట్ ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులు డిసెంబర్ 22వ తేదీన నిర్వహించిన గణిత మేళాలో ప్రతిభ చూపారు. దీంతో వారికి కామారెడ్డికి చెందిన మీనాక్షి గిఫ్ట్ షాపు యజమాని నీలం వెంకటేశ్ బంగారు పతకాలను మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గిరెడ్డి మహేందర్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

కామారెడ్డిలో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈవో రాజు

కామారెడ్డి/ఎల్లారెడ్డి రూరల్, జనవరి 2: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని డీఈవో కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం తెలంగాణ 2024 నూతన క్యాలెండర్‌ను డీఈవో రాజు మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఏసీజీవో నీలం లింగం, అకడమిక్ మానిటరింగ్ అధికారి వేణుగోపాల్, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం తెలంగాణ జిల్లా అధ్యక్షుడు భిక్కనూర్ యాదయ్య, ప్రధాన కార్యదర్శి అయ్యాల సంతోష్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎడ్ల రాజయ్య, ఎర్ర లింగం, శ్రీనివాస్, మోహన్, రవి తదితరులు పాల్గొన్నారు. కామారెడ్డిలోని శ్రీఆర్యభట్ట, కౌటిల్య, పీజేఆర్, స్ఫూర్తి డిగ్రీ కళాశాల, మంజీరా డిగ్రీ అండ్ పీజీ కళాశాలల క్యాలెండర్‌ను ప్రముఖ వ్యాపారవేత్త తిమ్మయ్యగారి సుభాష్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో విద్యా సంస్థల చైర్మన్ గురువేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ హన్మంత్ రావు, విజయ్ కుమార్, సత్యనారాయణ, నరేశ్‌గౌడ్, డైరెక్టర్లు గోపాల్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, సురేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఎల్లారెడ్డి పట్టణంలోని సొసైటీ కార్యాలయం వద్ద విండో అధ్యక్షుడు ఏగుల నర్సింహులు ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు మాట్లాడుతూ.. కొత్త సంవత్సరంలో సొసైటీ అభివృద్ధికి మరిన్ని చర్యలు చేపడుతామని అన్నారు. కార్యక్రమంలో ఆయనతోపాటు డైరెక్టర్లు, కార్యదర్శి విశ్వనాథం, సిబ్బంది సత్యనారాయణ, మల్లేశ్, సాయిబాబా, ప్రభాకర్ పాల్గొన్నారు.

శబరిమల తరలిన మాలధారులు

పిట్లం/ ఎల్లారెడ్డి, జనవరి 2: పిట్లం నుంచి పలువురు అయ్యప్ప మాలధారులు మంగళవారం ప్రత్యేక వాహనంలో శబరిమలకు బయల్దేరారు. ముందుగా వారు అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వారికి గురుస్వామి చంద్రం ఇరుముడులు కట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఈశ్వర్‌రెడ్డి, జగదీశ్, శశిధర్, నర్సాగౌడ్, వెంకట్‌రెడ్డి, బొడ్ల రాజు, భగవాన్ తదితరులు పాల్గొన్నారు. ఎల్లారెడ్డి పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో చంద్రం గురుస్వామి ఆధ్వర్యంలో ఇరుముడిని కట్టుకున్న మాలధారులు శబరిమలకు బయల్దేరి వెళ్లారు. శబరిమలకు వెళ్తున్న వారిలో మాలధారులు ఓర భీమయ్య, రమణ, మురళి ఉన్నారు.

దొంగతనం కేసులో ఒకరి అరెస్టు

బీబీపేట్, జనవరి 2 : బీబీపేట్ మండలంలోని యాడారం గ్రామ శివారులో ఉన్న డెయిరీ ఫామ్‌లో గురువారం రాత్రి సిద్దిపేట్ జిల్లా దుబ్బాక గ్రామానికి చెందిన పర్వతం రజరత్నం చోరీ చేసినట్లు ఎస్సై అనిల్ తెలిపారు. మంగళవారం బీబీపేట్ మండల కేంద్రంలోని పెద్దమ్మ గుడి వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా ఉండడంతో అతని పట్టుకొని విచారణ చేసి చోరీ చేసిన సొత్తు రికవరీతోపాటు అరెస్టు చేసి కోర్టుకు పంపించినట్లు ఎస్సై తెలిపారు.

బడిబయటి పిల్లల గుర్తింపు

నిజాంసాగర్, జనవరి 2: నిజాంసాగర్ మండలంలోని మంగ్లూర్ గ్రామంలో ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లల కోసం విద్యాశాఖ అధికారులు మంగళవారం సర్వే నిర్వహించారు. శివారులోని ఇటుక బట్టీల వద్ద కూలి పనులు చేస్తున్న వారి పిల్లలు పాఠశాలకు వెళ్లకుండా ఇంటి వద్దనే ఉంటున్నట్లు గుర్తించారు. వారిని పక్క గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో చేర్పించినట్లు సీఆర్పీ వరలక్ష్మి, ఐఈఆర్టీ సాయిలు, హెచ్ఎం యశ్వంత్ తెలిపారు.

ప్రవేశ పరీక్ష పోస్టర్ల ఆవిష్కరణ

పెద్ద కొడప్‌గల్, జనవరి 2: తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతిలో ప్రవేశాలకు నిర్వహించే పరీక్ష కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరుతూ పోస్టర్లను ఎంఈవో దేవీసింగ్ మంగళవారం ఆవిష్కరించారు. మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు ఈనెల ఆరో తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నళిని, సూపరింటెండెంట్ సతీశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంటింటికీ అయోధ్య పూజిత అక్షింతల పంపిణీ

బుర్గుల్‌లో నిర్వహిస్తున్న అక్షింతల శోభాయాత్ర, పెద్దకొడప్‌గల్‌లో.., సోమార్‌పేట్‌లో అక్షింతలను అందజేస్తున్న శ్రీరామ తీర్థ క్షేత్ర ట్రస్ట్ సభ్యులు

ఎల్లారెడ్డి రూరల్/ పెద్దకొడప్‌గల్/ నిజాంసాగర్/ సదాశివనగర్/బీబీపేట, జనవరి 2: అయోధ్య నుంచి వచ్చిన శ్రీరాముని పూజిత అక్షింతల పంపిణీ కార్యక్రమం మంగళవారం నుంచి జిల్లాలో ప్రారంభమైంది. అక్షింతల పంపిణీ సందర్భంగా ప్రజలు తమ ఇండ్లను శుభ్ర పరుచుకున్నారు. ముందుగానే సిద్ధంగా ఉంచుకున్న అక్షింతల్లో ట్రస్ట్ సభ్యులు అయోధ్య నుంచి తెచ్చిన అక్షింతలను కలిపారు. ఎల్లారెడ్డి మండలం సోమార్‌పేట్ గ్రామంలో శ్రీరామ తీర్థ క్షేత్ర ట్రస్ట్ సభ్యులు, పలువురు భక్తులు పంపిణీ చేశారు. అక్షింతలతోపాటు శ్రీరాముని చిత్ర పటం, సూచనల పత్రాన్ని అందజేశారు.

పెద్దకొడప్‌గల్‌లో అయోధ్య పూజిత అక్షింతల శోభాయాత్రను 'జై శ్రీరాం.. జై జై శ్రీరాం..' అంటూ నినాదాలు చేస్తూ వైభవంగా నిర్వహించారు. ప్రధాన వీధుల్లో సాగిన ఈ శోభాయాత్రకు మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. అక్షింతలను స్థానిక హనుమాన్ ఆలయంలో భద్రపరిచారు.

మహ్మద్‌నగర్‌లోని బుర్గుల్ గ్రామంలో అక్షింతలకు బ్యాండు మేళాలు, మంగళ హారతులతో స్వాగతం పలికారు. వాటిని రెండు రోజుల్లో గ్రామస్తులకు అందజేస్తామని సర్పంచ్ సవేరా బేగం, మనీశ్‌రెడ్డి, జీవన్, రాజు, బాబాగౌడ్, రాములు, సాయాగౌడ్ తెలిపారు.

సదాశివనగర్‌లో మార బాల్‌రెడ్డి, బొర్ర రాజాగౌడ్, రాములు, బాల్త శ్రీనివాస్ ఆధ్వర్యంలో అక్షింతలను ఇంటింటికీ తిరుగుతూ పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ భక్తిమార్గంలో నడవాలని సూచించారు.

బీబీపేట్ మండలంలోని మాందాపూర్‌లో హనుమాన్ మందిరం నుంచి అక్షింతల శోభాయాత్రను నిర్వహించారు. భజనలు, కీర్తనల మధ్య ఊరేగింపు కొనసాగింది.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

CHANGE OF NAME
★I, VISHWA PRASAD, S/o. Tathikonda Digambar, R/o. H.No. 1-6-18/1, Gandhi Gunj, Kamareddy Dist -503 111, T.S. Changed My Name as "TATHIKONDA VISHWA PRASAD". NT-319314

WANTED
★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 18K. Ph: 9640400073/9160900024. NT-319403-All

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే, ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన 4 లైన్లకు 250/- ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును
సెల్: 91827 77590

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.